


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని — తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :104 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 07-08-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ఆలోచన లేదు

న్యూఢిల్లీ: ఏవియేషన్ టర్బన్ ఫ్యూయల్‌లో ఇథనాల్ కలిపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు వచ్చిన వార్తలను పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కొట్టిపారేశారు.

అవన్నీ తప్పుడు వార్తలు అని, బాధ్యతారాహితంతో కూడిన వార్తలను నమ్మవద్దు అన్నారు. విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని మంత్రి రామ్మోమన్ నాయుడు తెలిపారు. ఇథనాల్, సస్టేనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ అనేవి రెండూ భిన్నమైనవని, వాటిని కలపరాదు అని మంత్రి తెలిపారు. సస్టేనియబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇంధమని , ఏసీఏఓ గుర్తింపు దానికి ఉందనన్నారు. చాలా టెస్టింగ్ తర్వాత అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం తయారు చేస్తారన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడాన్ని మానుకోవాలన్నారు. విమాన ప్రయాణికుల్లో గుబులు నింపడం తప్ప ఏమీ లేదన్నారు. ప్రయాణికుల భద్రతకు




ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసే బాధ్యత నాది

హైదరాబాద్, గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసే బాధ్యత నాది ఒకవేళ కాకున్నా కూడా దాని బాధ్యత కూడా నాదే అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం కోహెడ మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం1,61 కోట్ల రూపాయలతో ఓపెన్ షెడ్ , ఫ్లాట్ ఫారం , మీటింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ ఆవరణలో మొక్కలు నాటారు, అనంతరం ధర్మసాగర్ పల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించినరు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్ట్ కి సంబంధించి 250 కోట్లు కాలువల భూసేకరణ కి విడుదల చేయడం జరిగింది.రైతులు కాలువల భూసేకరణ కి సహకరించాలి.

### 5 లక్షల చొప్పున ప్రోత్సాహం

గౌరవెల్లి ప్రాజెక్ట్ పై న్యాయ పరమైన చిక్కులు తొలగిపోయాయి. గౌరవెల్లి కుడి ఎడమ కాలువలకు సంబంధించి డిస్ట్రిబ్యూట్ కెనాల్ కి సంబంధించి ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తుంది అని అన్నారు. అలాగే తంగలపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. బోర్ వెల్ రీఛార్జి పాయింట్స్ పెంచుకోవడం, ఆయిల్ ఫామ్ సాగు పెంచుకునే గ్రామాలకు 5 లక్షల చొప్పున ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు. గ్రామల అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తా ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంక్ వాడుకోవాలి ఏడాది కాలంగా గ్రామాల్లో ప్లాస్టిక్ దూరం చేస్తూ స్టీల్ సామాగ్రి ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం.. పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నాము ప్రజలంతా సహకరించాలి. టెండర్లు అయి పనులు ప్రారంభం కాని కాంటాక్ట్ లు రద్దు చేస్తాం అని అన్నారు.

### క్షేత్రస్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పరిశీలన

తంగలపల్లి లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు బ్లాక్ ల వారిగా జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి



పలు సూచనలు చేశారు. మూడు షిఫ్ట్ ల వారిగా వేగంగా కొనసాగుతున్న పనులు వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో కోహెడ మండలం తంగలపల్లి లో 30 ఎకరాల్లో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో ఇక్కడ స్కూల్ భవనాలు పూర్తి చేసి హాస్టల్ వసతులతో సహా తరగతులు ప్రారంభిస్తాం. అన్ని క్రీడా పరమైన,ఇతర సౌకర్యాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ స్కూల్ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తున్నాం.

### నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం వెనుకబడి ఉంది..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంక్షేమ శాఖ మంత్రులుగా మేము ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కలగజేయాలని ఇందులో చదువుకున్న పిల్లలు తెలంగాణ భావి తరాలకు ఉపయోగపడాలి. ప్రపంచ స్థాయి పాఠశాలలతో ఇవి పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నాం దేశానికి ఆదర్శంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లు ఉండనున్నాయి.విద్యార్థులు అధ్యాపకులు ఇక్కడే ఉండి పాఠ్యాంశాలు బోధించే

## అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తా



హైదరాబాద్, ఆగస్టు 6: సామాజిక న్యాయ తెలంగాణను తీర్చాదిద్దాడానికి ముందున్నామని టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఈరోజు(గురువారం) సరూర్‌నగర్‌లో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని విమర్శించారు. ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది పలుకుతుందని, అనేక మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని వెల్లడించారు.సామాజిక న్యాయం అనగానే అందరూ భయపడుతున్నారని.. అయితే ఇది ధర్మపోరాటమని కవిత అన్నారు. రాష్ట్రంలో బీసీలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరస్పరం ప్రేమ లేఖలు రాసుకుంటారని.. బీసీ బిల్లుకు ఆమోదం తీసుకురావడంలో ఈ దోస్తీ ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు బీసీ బిల్లుకు ఆమోదం రాకపోతే సంక్రాంతి తర్వాత ఢిల్లీకి వెళ్లి ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.తెలంగాణలో ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతోందని కవిత అన్నారు. తాను అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినా, అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వారంతా కూడా బుద్ధుడి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, అలాగే ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కవిత డిమాండ్ చేశారు.

## రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులకు.. మంత్రి పొంగులేటి శంకుస్థాపన



కూసుమంచి: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి కూసుమంచి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల పురోగతే లక్ష్యంగా రూ. 6.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. రాజుపేట బజార్ వద్ద ఈశ్వరమాదారం నుంచి భద్రుతండా వరకు రూ. 1.76 కోట్లతో, తాళ్లగడ్డ తండా వరకు రూ. 50 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శ్రీకారం చుట్టారు. అనంతరం చౌటుపల్లి గ్రామంలో రూ. 3.20 కోట్లతో నిర్మించనున్న హైలెవెల్ వంతెనకు, లింగారం తండాలో రూ. 1.28 కోట్లతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అనేక అభివృద్ధి పనులు చేశానని, ఇప్పుడు మంత్రిగా గ్రామంలోని మిగిలిన అన్ని పనులను పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లింగారం తండాలోనే రూ. 5.45 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, తండాలో వీధి దీపాల ఏర్పాటును తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలోని ప్రతి రేషన్ కార్డుదారునికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణ రంగానికి ప్రాధాన్యమిస్తూ తొలి విడతలో 4.5 లక్షలు, మలి విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కొద్ది రోజుల్లోనే రెండో విడత ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా ప్రారంభిస్తామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా నిధులను ఇప్పటికే జమ చేశామని, వరి కొనుగోళ్లలో సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు.

## దమ్ముంటే ఆడియోలు బయట పెట్టండి.. హరీష్ రావుపై మహేష్ కుమార్ గౌడ్ ఫైర్!

హైదరాబాద్, సీఎం రేవంత్ రెడ్డికి నాకు మధ్య గ్యాప్ ఉందంటూ కొంతమంది వ్యక్తులు మాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నార పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇవి వాస్తవాలు కావని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి ముఖ్యమంత్రే అని, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంలు కో ఆర్డినేషన్ కమిటీలో చర్చిస్తే బాగుంటుందని అనుకున్నామని అన్నారు. అందరం చర్చిస్తే మంచి నిర్ణయాలు తీసుకోగలమని అనుకున్నామని, కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదని మేం ముఖ్యమంత్రిని గౌరవిస్తాం అని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు.

### మా మధ్య ఏం లేదు..

పార్టీ, ప్రభుత్వం వేరు వేరు కాదు. రేవంత్ రెడ్డి మా కాంగ్రెస్ ముఖ్యమంత్రి నాకు, సీఎంకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదని ఆయన అన్నారు. సీఎం నేను రోజూ ఫోన్లో మాట్లాడుకుంటామని, నిన్న కూడా సీఎంతో ఫోన్ మాట్లాడానని అన్నారు. నా ఆడియోలు వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. దమ్ముంటే నా ఆడియోలు, వీడియోలు బయట పెట్టండి అంటూ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. సీఎంకు, నాకు మంచి సఖ్యత ఉందని, దొంగ చాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్‌లో లేదని స్పష్టం చేశారు. ఏమున్నా మేం మొహంపైనే మాట్లాడుకుంటామని, బయట జరుగుతున్న విషయాలను చర్చించుకుంటామని అన్నారు. కో ఆర్డినేషన్ కమిటీలో కీలక చర్చ జరిగింది. అందరం ఓపెన్ గానే మాట్లాడుకున్నాం అని అన్నారు.




హరీష్ రావు పై సెటైర్లు..

కో ఆర్డినేషన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం మీరు ఫోటోలో చూస్తే వంశీ మధ్యలో కూర్చున్నట్టు అనిపిస్తోందని, ప్రోటోకాల్ ప్రకారం మీనాక్షీ నటరాజన్ సమీక్ష నిర్వహించారని తెలిపారు. టేబుల్ ఓవెల్ షేప్‌లో ఉంది కాబట్టి అందరూ పొరబడుతున్నారని తెలిపారు. లీగల్ నోటీసులకు భయపడం నేను హరీష్ రావుపై అబద్ధాలు చెప్పలేదు. ఏమైనా ఉంటే న్యాయ స్థానంలో కొట్లాడుతామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అరవింద్ మాటలు నీటి మూటలు నా ముందు అరవింద్, సంజయ్ పిల్లలు, లాల్ బహదూర్ శాస్త్రి కూడా హైట్ తక్కువే. దేశాన్ని ఏలలేదా? అని ఫైర్ అయ్యారు.

## కేబినెట్ విస్తరణపై కర్ణాటక ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 6,పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉ వని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్తుల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్తులు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి,

## సందట్లో సడేమియా.. ఆ పని కానిచ్చిన తెలంగాణ బీజేపీ చీఫ్



హైదరాబాద్,తెలంగాణ బీజేపీలో నేతల మధ్య లుకలుకలకు ఫుల్‌స్టాప్ పడినట్టేనా? కేంద్రం పెద్దలతో నేతలంతా ఒకే తాటి మీదకు వచ్చారా? ఇంకా ఏమైనా ఉందా? పైకి చెప్పకున్నా.. లోలోపల కొందరు నేతలు అసంతృప్తితో ఉన్నారా? ఇదే సరైన సమయమని భావించిన తెలంగాణ బీజేపీ, పెండింగ్‌లో ఉన్న జిల్లా అధ్యక్షుల పదవులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

### అంతర్గత విభేదాలకు ముగింపు

తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా మూడు జిల్లాల అధ్యక్షుల నియామకాలు పెండింగ్‌లో పడ్డాయి. నేతలంతా ఒకే తాటి మీదకు రావడంతో ఆ జిల్లాల అధ్యక్షుల ఎంపిక ఓ కొలిక్కి వచ్చింది. అందులోని కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్- అర్బన్ వంటి జిల్లాలు ఉన్నాయి. ఇప్పుడు వాటికి కొత్త అధ్యక్షులను నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు.

### ఇద్దరు నేతలకు సమ న్యాయం!

కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్, మేడ్చల్- అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్‌రెడ్డిలను నియమించారు. ఈ జిల్లాల అధ్యక్షుల ఎంపికపై కీలక నేతలు ఈటల రాజేందర్- బండి సంజయ్ మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. తమ వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరునేతలు పట్టుబట్టినట్టు ప్రచారం సాగింది. ఈ కారణం వల్ల ఆ నియామకాలను పార్టీ నాయకత్వం పెండింగ్‌లో పెట్టింది. ఇటీవల ఇరువురి నేతల మధ్య విస్తృత చర్చలు జరగడం, నేతలు సరేనని ఊ కొట్టినట్టు సమాచారం. అన్నివర్గాలకు ఆమోద యోగ్యమైన జిల్లాల అధ్యక్షుల పేర్లను ఖరారు చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కరీంనగర్ విషయంలో బండి సంజయ్ తన పట్టు నిరూపించుకున్నారని అంటున్నారు. మేడ్చల్ విషయంలో ఈటెల పతం నెట్టిందని అంటున్నారు. మొత్తానికి నేతలంతా ఒకేతాటి మీదకు రావడంతో ఆ మూడు పదవులు భర్తీ అయిపోయాయి. ప్రస్తుతానికి టీ బీజేపీలో మంచి వాతావరణ కనిపిస్తోందని అంటున్నారు కొందరు. ఇదే కంటిన్యూ అవుతుందా? లేదా అనేది చూడాలి.



## సంపాదకీయం

శుక్రవారం 07-08-2026

# గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది. సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు. ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు. సముద్రంలో లభించే చమురు, గ్యాసును తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు. లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి. చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్కును భరించేందుకు ముందుకొచ్చింది. చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగింది.అలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది. 'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది. ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది. అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది. ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుల్లోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా దెబ్బతినడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి. సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# అదిలాబాద్ కాంగ్రెస్ లో అలజడి..!



ఆదిలాబాద్ :ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అనూహ్య అలజడి మొదలైంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలలో ఒకరు ఆదివాసీల హక్కుల రక్షణ పేరుతో ప్రభుత్వం తీరును ప్రశ్నించగా..మరో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాత్రం అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటుండటం హాట్ టాపిక్ గా మారింది. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్నారంలో అటవీ అధికారుల తీరుపై తిరుగుబాటు ప్రకటించడం కలకలం రేపింది.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి ప్రాంతం వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఆదివాసీ యువకులను కొట్టిన అటవీ శాఖ అధికారులపై 24 గంటల్లో చర్య తీసుకోకుంటే ప్రభుత్వానికే వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమం చేస్తానని ఎమ్మెల్యే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆదివాసీలపై చేయి చేసుకున్న ఇంధన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తపాలాపూర్, ఉడుంపూర్, ఖానాపూర్ రేంజ్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడిన వెడ్మ బొజ్జు అటవీశాఖ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఖానాపూర్ నియోజకవర్గంలోనే ఒక వ్యతిరేక సామ్రాజ్యం ఏర్పాటు చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్న ఆదివాసీ యువకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జరిగిన రాస్తారోకోలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనడం గమనార్హం.

ఆదివాసీల రాజ్యం కోసం పోరాటం

అటవీశాఖ అధికారులు ఆదివాసీల పట్ల తమ అణిచివేత వైఖరి మార్చుకోకపోతే కవ్వాల్ టైగర్ జోన్ ప్రారంభమైన జన్నారం నుంచే అటవీశాఖకు వ్యతిరేక ఉద్యమానికి పునాది వేస్తామని వెడ్మ బొజ్జు హెచ్చరించారు. అడవిలోకి ప్రజలను రానివ్వని అధికారులు... రెవెన్యూ భూముల్లోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని వెడ్మబొజ్జు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి వ్యతిరేక సామ్రాజ్యం ఏర్పాటు చేయడంతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని, ఉద్యమాన్ని ఖానాపూర్ నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని, ఆదివాసీల రాజ్యం తీసుకొస్తానని హెచ్చరించారు.

దిగొచ్చిన సర్కార్..ఇందన్ పల్లి ఎఫ్ ఆర్ వో సస్పెండ్

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డిమాండ్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చింది. ఆదివాసీలపై చేయి చేసుకున్న ఇంధన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో ఈ విషయమై ఆదివాసులు ఇక సంయనం పాటించాలంటూ ఎమ్మెల్యే బొజ్జు విజ్ఞప్తి చేశారు.

ప్రేమ్ సాగర్ రావుపై సంచలనం రేపుతున్న అవినీతి ఆరోపణలు

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై తాజాగా వచ్చిన అవినీతి ఆరోపణలు ఆ జిల్లాలో సంచలనంగా మారాయి. ప్రేమ్ సాగర్ రావు కుటుంబానికి చెందిన వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు ఆరేళ్లలో 11కంపెనీల పేరిట 9 బ్యాంకుల నుంచి రూ. 470 కోట్ల అప్పులు తీసుకున్నాయని, అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో ఆ సంస్థలను బ్యాంకర్లు డిఫాల్టర్లుగా ప్రకటించారని ఆయన రాజకీయ ప్రత్యర్థులు బయటపెట్టారు. ఎన్సీఎల్టీలో కేసులు కూడా నడవడంతో పదేళ్ల పాటు వారికి నోటీసులు కూడా జారీ కాబడ్డాయని, అయితే 2023లో గెలవగానే ప్రేమ్ సాగర్ రావు రూ. 450 కోట్ల అప్పు క్లియర్ చేశారని, గెలిచిన రెండున్నరేళ్ల లోపునే రూ. 450 కోట్లకుపైగా అప్పులను ఆయన ఎలా చెల్లించారంటూ ప్రశ్నిస్తున్నారు. మార్చి 24న బంజారాహిల్స్ నికో బ్రాంచ్ లో ఒక్క రోజునే రూ.120కోట్లు ఒకేసారి చెల్లించి ఎన్ వోసీ పొందారని, ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన ఓ ప్రైవేట్ హోటల్ పేరిట ఉన్న రూ.87కోట్ల అప్పును కూడా క్లియర్ చేశారని ఆరోపిస్తున్నారు.ప్రేమ్ సాగర్ రావు అఫిడవిట్ ప్రకారం 2018లో రూ. 26 కోట్లు.. 2023లో రూ. 54 కోట్ల ఆస్తులు ఉన్నాయని, 2023లో ఎమ్మెల్యేగా గెలిచాక అన్ని వందల కోట్ల అప్పులు ఎలా చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రెండున్నరేళ్లుగా ప్రేమ్ సాగర్ రావు యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ, ఇసుక దందా, బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యేపై దాదాపు 40కి పైగా క్రిమినల్ కేసులు.. అందులో భూకబ్జాలు, బెదిరింపులు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. కాప్రా భూకబ్జాలో ఎమ్మెల్యే పేరు వినిపించిందని.. బాధితులు గాంధీభవన్‌ను ముట్టడించారని గుర్తు చేస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రూ. 500 కోట్ల అక్రమాలు జరిగాయని, భూసేకరణ కోసం దళితులను బెదిరించి, బలవంతంగా ఎకరా రూ. 13 లక్షలకే భూములు లాక్కుని ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ప్రేమ్ సాగర్ రావుపై గతంలో ఆరోపణలు ఉన్నాయని వారు వెల్లడిస్తున్నారు. పూర్తయిన పనులకు కూడా మళ్లీ టెండర్లు పిలిచి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని ప్రత్యర్థులు ఆరోపించారు. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్వతంత్ర శైలీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లయ్యింది. ఎమ్మెల్యేల వ్యవహారం కాంగ్రెస్ రాజకీయాల్లో కలకలం రేపింది.ప్రేమసాగర్ రావు బ్యాంకుల రుణ బకాయిల చెల్లింపులపై సందేహాల నేపథ్యంలో ఆయన సంస్థలపై ఈడీ, సీబీఐలకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నేత వెరబెల్లి రఘునాథ్ రావు వెల్లడించారు.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

జయశంకర్ భూపాలపల్లి.ప్రజల సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ ఉత్తర్వులు (ఉ.నా.ఓబ.ఔనీ.4, తేదీ: 04.08.2026) జారీ చేసింది. ప్రతి వారం సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది.నోడల్ అధికారి: ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ (ఓఖఊా) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.అధికారుల హాజరు: తహసీల్దార్, ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, పోలీస్ మరియు ఇతర మండల స్థాయి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, వెంటనే చర్యలు చేపడతారు.డిజిటల్ నమోదు : మండల స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఏకీకృత 'ప్రజావాణి పోర్టల్'లో నమోదు చేసి, ఫిర్యాదుదారునికి గ్రీవెన్స్ ఐడీ తో కూడిన రసీదును అందిస్తారు.ప్రాధాన్యత ఉ సౌకర్యాలు: వికలాంగులు, వయోవృద్ధులు, గర్భిణులు మరియు బాలింతలకు అర్జీల సమర్పణలో మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మంచినీరు, కూర్చోవడానికి సీటింగ్, హెల్ప్‌డెస్క్ వంటి ప్రాథమిక సౌకర్యాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తారు.

# జార్ఖండ్ లో రోడ్కెక్కున విద్యార్థులు

రాంచీ,వేలాదిమంది విద్యార్థులు. చేతిలో ఫ్ల కార్డులు.. అందరివి ఒకటే నినాదాలు.. మాకు న్యాయం జరగాలి.. అక్రమాలకు పాల్పడిన అధికారులు జైలుకు వెళ్లాలి.. విద్యార్థుల గోస పట్టని ప్రభుత్వం దిగిపోవాలి.. మొన్ననే కదా జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థులు ఆందోళన చేసింది. పోలీసులతో గొడవపడి.. తాము అనుకున్నది సాధించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన దేశవ్యాప్తంగా ఉన్న యువత అగ్రహానికి ప్రతీకగా నిలిచింది. ఇటీవల చాలా రాష్ట్రాలలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కు సంబంధించిన ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. ఈ ఘటనల వెనుక ఉన్న వ్యక్తులను శిక్షించాలని.. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చాలామంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మీద తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.తాజాగా ఝార్ఖండ్ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చారు. అక్కడి ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్లు చేస్తున్నారు. దీనికి కాక్రోచ్ జనతా పార్టీ సపోర్ట్ చేస్తుంది.. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో క్లీన్ జెపిఎస్సి పేరుతో వేలాది మంది విద్యార్థులు నిరవధికంగా నిరాహార దీక్ష చేస్తున్నారు. విద్యార్థి సంఘం నాయకుడు దేవేంద్రనాథ్ మహా ఆధ్వర్యంలో ఈ ఆందోళన మొదలైంది.. దీనంతటికీ ప్రధాన కారణం జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. జార్ఖండ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో భారీగా అక్రమాలు.. ప్రశ్నా పత్రాలు లీకేజీ జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. రాజధాని రాంచీలో విద్యార్థులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు.. ఏప్రిల్ 19న ఈ పరీక్ష నిర్వహించారు. ఫలితాలను జూలైలో విడుదల చేశారు. నిర్ణీత మార్కులను ప్రకటించకపోవడంతో స్టూడెంట్స్ లో ఆగ్రహం మొదలైంది. దీనికి తోడు ఓఎంఆర్ షీట్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మెయిన్స్ పరీక్షను.. పరీక్షలను వాయిదా వేసింది. దీంతో పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. ఈ వివాదం ముదిరిపోవడంతో జెపి ఎస్ఎస్సి చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ వ్యవహారం మీద విచారణకు ఆదేశించారు. 11 మందిని అరెస్ట్ చేయించారు. అయితే ప్రభుత్వ చర్యల మీద విద్యార్థులు సానుకూలంగా లేరు.. వారంతా సీబీఐ దర్యాప్తును కోరుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో న్యాయం చేయలేకపోతే ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని.. ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# వారణాసి టూ అంటార్కిటికా...

హైదరాబాద్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబోలో రాబోతోన్న విజువల్ వండర్ వారణాసి . తండ్రీ కొడుకుల ఎమోషన్ ఈ స్టోరీ అంటూ గతంలో రివీల్ చేశారు రాజమౌళి. తాజాగా ఓ ఇంటర్నేషనల్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో షూటింగ్ బిగ్ అప్డేట్‌తో పాటు ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు.వారణాసి కథ ఆధ్యాత్మిక నగరం వారణాసితో మొదలై అంటార్కిటికా, ఆఫ్రికా అడవుల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళ్లి మళ్లీ వారణాసికి తిరిగొస్తుందని చెప్పారు రాజమౌళి. 'నాకు ఇండియానా జోన్స్ కథలంటే చాలా ఇష్టం. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అవి నచ్చుతాయి. స్టోరీ, దాని నేపథ్యం తెలీకుండా ఆడియన్స్ మూవీని ఆస్వాదించలేరు. అందుకే గ్లింప్స్‌లో అన్నింటినీ చూపించాం. షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తైంది. ఇంకా 20 శాతంలో చిన్న చిన్న సీన్స్ చేస్తున్నాం. యాక్షన్ పార్ట్ మొత్తం ఎప్పుడో కంప్లీట్ అయిపోయింది.' అని తెలిపారు. 2022 నుంచి వారణాసి కథను డెవలప్ చేయడం స్టార్ట్ చేశామని... దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని చెప్పారు రాజమౌళి. 'కథలో ఉన్న భారీ స్థాయి ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయడానికి కారణం. 300 అడుగులకు పైగా ఉన్న భారీ మంచు కొండ, రామాయణంలోని భారీ వానర సేన ఇలా ఎన్నో కీలక సీన్స్ ఇందులో ఉన్నాయి. వాటిని అద్భుతంగా, విశాలంగా చూపించాలంటే ఐమ్యాక్స్ ఫార్మాట్ సరైనది అనిపించింది.హాలీవుడ్ సినిమాలంటే నాకు చాలా ఆసక్తి. చిన్నప్పటి నుంచి వాటినే చూస్తూ నేను పెరిగాను. ఆ ప్రభావం నా సినిమాలపై ఉంటుంది. నా సినిమాలను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తుంటారు. అందుకు నేనెప్పుడూ ఇబ్బంది పడను.' అని తెలిపారు.అక్టోబర్ కల్లా ఈ మూవీ షూటింగ్ పూర్తవుతుందని రాజమౌళి చెప్పారు. ఆయన గత చిత్రాల కంటే ఈసారి డిఫరెంట్‌గా షూటింగ్‌ను ప్లాన్ చేశారు. చిన్న చిన్న సీన్స్ పూర్తి చేస్తుండగా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే షెడ్యూల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా సాగుతుండగా... బీజీఎం వర్క్ కూడా స్టార్ట్ చేసినట్లు ఎంఎం కీరవాణి తెలిపారు. ఇప్పటివరకూ గ్లింప్స్ తప్ప ఈ భారీ ప్రాజెక్టు నుంచి ఎలాంటి సర్ప్రైజెస్ లేవు. మహేశ్ బాబు బర్త్ డే సందర్భంగా టీజర్ రిలీజ్ చేస్తారని భావిస్తున్నారు. మహేశ్ బర్త్ డే గిఫ్ట్‌గా టీజర్ రిలీజ్ చేయాలని లేదా స్పెషల్ లుక్ అయినా రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఈ మూవీలో రుద్రుడు, శ్రీరాముడిగా మహేశ్ బాబు కనిపిస్తుండగా... విలన్ రణకుంభగా మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. మందాకినిగా బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# తెలంగాణలో కేటీఆర్ పాదయాత్ర.. సీఎం రేవంత్ రెడ్డి పై భారీ స్కెచ్చేసిన బీఆర్ఎస్!

హైదరాబాద్, కేటీఆర్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే షెడ్యూల్ సైతం ప్రకటించే అవకాశం ఉంది. ప్రజాసమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో జాప్యం అంశాలే ఎజెండాగా యాత్ర కొనసాగించబోతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే ప్రారంభం అవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఏ ప్రాంతం నుంచి అనేదానిపై మాత్రం త్వరలోనే క్లారిటీ రానుంది.

హామీలపై ప్రత్యేక ఫోకస్..

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజాసమస్యలపై ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. ప్రతీ చిన్న తప్పిదాన్ని సైతం నిలదీస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన కేటీఆర్.. ఆ అంశాలపైనే పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. స్థానిక సమస్యలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన సాగడం లేదని వ్యతిరేకత ఉందని.. ఈ సమయంలోనే యాత్ర చేపడితే బీఆర్ఎస్ పార్టీకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. అందుకే యాత్రతో ప్రజల ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో యాత్రకు శ్రీకారం


ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో పాదయాత్రను చేపట్టబోతున్నారు. అయితే జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి ప్రారంభం చేస్తారనేది మాత్రం త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మూడు విడుతలుగా పాదయాత్ర చేస్తారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యాత్ర ముగిసేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ముగింపురోజూ భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. అయితే రాష్ట్రంలోని 33 జిల్లాలు కవర్ అయ్యేలా యాత్రకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ రెండో విడుత, మూడో విడుత ఉత్తర తెలంగాణ జిల్లాలు కవర్ అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మైలేజ్ పెంచుకునేలా ప్లాన్..

వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ కు అర్బన్ ప్రాంతంలో గట్టిపట్టుకుంది. ప్రజఆదరణ ఉంది. అయితే రూరల్ ఏరియాలో కొంత కనెక్టివిటీ తక్కువ. గ్రామీణ ప్రజలకు చేరువ అయ్యేందుకు, వారి సమస్యలను యాత్రతో ముఖాముఖీ తెలుసుకొని వారితో మమేకం కావాలని భావిస్తున్నారు. దీంతో గ్రామీణ స్థాయిలోనూ మైలేజ్ పెంచుకోవాలని, పార్టీలోనూ ఇంకా పటిష్టం కావాలని ప్రయత్నాలు షురూచేస్తున్నారు. పార్టీ అంటే కేసీఆర్ ఎలాగో.. రాబోయే కాలంలో పార్టీ అంటే కేటీఆర్ అనే విధంగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో పార్టీపై పట్టుపెంచుకోవడం, ప్రజల్లోని వ్యతిరేకతను పార్టీవైపు మళ్లించడం కోసమే పాదయాత్ర చేయాలని నిశ్చయించుకున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

పాదయాత్రలతో అధికారం..

రాజకీయాల్లో ఒక సెంటిమెంట్ ఉంది. ఏ పార్టీ నేత అయితే జనం మధ్యకు వెళ్లి సుదీర్ఘ పాదయాత్ర చేస్తారో, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ విజయం




సాధించడం ఖాయమని చరిత్ర స్పష్టం చేస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి పదేళ్ల టీడీపీ పాలనకు చెక్ పెట్టేందుకు ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టారు. 2004లో అధికారాన్ని కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత 2012లో చంద్రబాబు, 2018లో వైఎస్ జగన్ ఇదే వ్యూహంతో సక్సెస్ అయ్యారు. ఇక 2023లో టీడీపీ యువనేత నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చేసిన పాదయాత్ర ఆ పార్టీని అధికారంలోకి తీసుకురాగా, తెలంగాణలో 2022లో రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చింది. యూపీలో అఖిలేష్ యాదవ్ సైతం2012లో అధికారంలోకి రాగానే సీఎం అయ్యారు. అయితే కేటీఆర్ సైతం ఇదే గెలుపు సెంటిమెంట్ ను నమ్ముకొని, సక్సెస్ సాధించాలనుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్షేత్రస్థాయిలో బలోపేతం..

అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో పాలనాపరమైన ఒత్తిళ్లు, అధికార దూరం కారణంగా బీఆర్ఎస్ పార్టీకి, క్షేత్రస్థాయి ప్రజలకు మధ్య కొంత దూరం పెరిగిందనే వాస్తవాన్ని గులాబీ శ్రేణులు గుర్తించాయి. ఇప్పుడు ఆ అంతరాన్ని పూర్తిగా చెరిపేసేందుకు, గ్రామీణ స్థాయితో సంబంధాలను మళ్లీ బలోపేతం చేసుకునేందుకు ఈ యాత్రను ఒక బ్రహ్మాస్త్రంగా కేటీఆర్ భావిస్తున్నారు. అయితే పాదయాత్రతో ఆ ఇమేజ్‌ను పూర్తిస్థాయి ప్రజా నాయకుడిగా మార్చుకోవాలని కేటీఆర్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

అసలు ప్లాన్ అదే..?

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న అసంతృప్తి బీఆర్ఎస్‌కు రాజకీయంగా కలిసివవస్తుందని పార్టీ సైతం భావిస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత బలం కొంత బలపడింది. అయితే ఈ పాదయాత్రతో నిరాశలో ఉన్న పార్టీ కేడర్‌లో జోష్ పెంచబోతున్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని గుర్తించడం, ప్రజల కష్టనష్టాలను, స్థానిక సమస్యలను నేరుగా అర్థం చేసుకొని అదే ఎన్నికల ఎజెండాగా మల్చుకోబోతున్నారు. కేటీఆర్ పాదయాత్రను విజయవంతం చేసి తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎన్ పార్టీని మళ్లీ నంబర్ వన్ గా, కాంగ్రెస్ కుప్రత్యామ్నాయంగా నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

ఏలూరు, ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి

# 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

నెల్లూరు, వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముప్పు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడానికి గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది.రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం వెట 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో విత్తనాల సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి. దాదాపు 5,000 హెక్టార్లలో తాటి వనాల ఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి" అని పవన్ కళ్యాణ్ తెలిపారు.


## ఇన్సూరెన్స్ లేకపోతే..పెట్రోల్, డీజిల్ బంద్..

భువనేశ్వర్, బీమా లేని వాహనాలపై కఠిన చర్యలకు భారత అత్యున్నత న్యాయస్థానం సిద్ధమవుతోంది. మోటార్ థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించే లక్ష్యంతో సుప్రీంకోర్టు పలు కీలక ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా, వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధ్రువీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించనున్నారు. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది.అంతే కాకుండా, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను వాహన్ డేటాబేస్, బీమా డేటాబేస్‌తో అనుసంధానించాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. దీంతో బీమా లేని వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి, అవసరమైతే ఇ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అతివేగం, రెడ్ సిగ్నల్ ఉల్లంఘన, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న ఐటీఎంఎస్ వ్యవస్థను బీమా ధ్రువీకరణకు కూడా వినియోగించాలని సూచించింది.రోడ్డు తనిఖీల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ యాప్‌లు లేదా హ్యాండ్‌హెల్డ్ పరికరాలను అందించి, వాహన బీమా వివరాలను తక్షణమే పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో భౌతిక బీమా పత్రాలపై ఆధారపడకుండా అధికారులు ఆన్‌లైన్‌లోనే బీమా స్థితిని నిర్ధారించగలరు.కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు తప్పనిసరి థర్డ్-పార్టీ బీమా కాలపరిమితిని కూడా పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాల బీమాను నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు సంవత్సరాల బీమాను ఆరు సంవత్సరాలకు పొడిగించాలని ప్రతిపాదించింది. ప్రారంభ బీమా గడువు ముగిసిన తర్వాత బీమా పునరుద్ధరించకుండా రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్యను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఇప్పుడు ఈ ప్రతిపాదనలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.

### వరంగల్,హనుమకొండ బస్టాండ్లలో ఆకస్మిక తనిఖీలు

వరంగల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వరంగల్, హనుమకొండ ప్రధాన బస్టాండ్లు, హనుమకొండ డిపోలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలు, డిపో నిర్వహణ, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వరంగల్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ 'ఈ-డ్రైవ్' పథకం కింద మరో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్‌లో 112 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు.బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళా ప్రయాణికుల భద్రత, వెయిటింగ్ హాళ్ల నిర్వహణ, బస్సుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమైన నాగిరెడ్డి బస్సు రూట్లు, ఆక్యుపెన్సీ నిష్పత్తి, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయమని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికులకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 9 వేలకుపైగా బస్సుల ద్వారా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత ఆధునీకరించి, ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్, చీఫ్ సివిల్ ఇంజినీర్ కవిత, వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్‌తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

# వైసీపీ దారుణ ఓటమి.. బాబులో జ్ఞానోదయం!



అమరావతి,ఊరికే ఏదీ చేయరు మహానుభావులని పెద్దలు అంటుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక శ్వేత పత్రం విడుదల చేశారంటే, దాని వెనుక ఏదో పెద్ద కథే వుంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇదీ అని ప్రజలకు చెప్పడానికి శ్వేత పత్రాన్ని అందరి ముందు ఉంచారు. ఇప్పుడు రెండేళ్లకు పైగా పాలన పూర్తయ్యాక, మళ్లీ శ్వేత పత్రాన్ని విడుదల చేసి, గత ప్రభుత్వం అప్పులన్నీ చేయడం వల్లే, నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి అని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది.కేవలం రెండు హామీలు తప్పి, మిగిలిన అన్నింటిని అమలు చేసినట్టు చంద్రబాబు స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాలు, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పానన్నారు. ఉద్యోగాలకు సబ్సిడీలు భరించాలి కాబట్టి దానిపై దృష్టి పెట్టినట్టు చంద్రబాబు చెప్పారు. మహిళలకు నెలనెలా సాయం ఎలా ఇవ్వాలో కసరత్తు చేస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. హామీలు అమలు చేయలేదని విమర్శించే వారు సీపీఎస్‌పై సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. అలాగే మద్యపాన నిషేధం అమలు చేస్తామని ఎందుకు చేయలేదో చెప్పాలని వైసీపీ నేతలను ఆయన నిలదీశారు.అంతేకాదు, సంక్షేమం కోసం ఎంత మేరకు ఖర్చు చేశారో కూడా ఆయన వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఈ రెండేళ్లలో పేదలకు రూ.1,49,401 కోట్లు సంక్షేమ రూపంలో ఇచ్చామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన దానికి మించి సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ ఇంత మొత్తంలో సంక్షేమానికి ఖర్చు చేయలేదన్నారు.ఇదే సందర్భంలో వైసీపీ వైపు నుంచి ప్రశ్నల వర్షం కురుస్తోంది. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ హామీ, కొత్త పింఛన్లకు మోక్షం లేదని, అలాగే అమలవుతున్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకాల్లో కోతల గురించి ప్రతిపక్ష పార్టీ ప్రశ్నిస్తోంది.అయితే చంద్రబాబును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సుదీర్ఘ రాజకీయ, పరిపాలనానుభవం కలిగిన చంద్రబాబు ప్రతిదీ ఆచితూచి స్పందిస్తుంటారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల విషయంలో చంద్రబాబు అమలు చేయడం లేదంటే , దాని వెనుక బలమైన ఆలోచన ఏదో వుండే వుంటుంది.మరీ ముఖ్యంగా ప్రతి హామీని అమలు చేసి, ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లకే పడిపోవడాన్ని చంద్రబాబు అధ్యయనం చేసి వుంటారు. సంక్షేమ పాలనకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఒక బ్రాండ్‌గా నిలిచింది. అయినప్పటికీ ప్రజలు పట్టం కట్టలేదు. ఆ విషయాన్ని చంద్రబాబు పరిగణలోకి తీసుకునే, ఏవైతే ముఖ్యమైన హామీలని చంద్రబాబు భావిస్తున్నారో, వాటిపైనే దృష్టి సారించారని ఎందుకు అనుకోకూడదనే ప్రశ్నవస్తోంది.సంక్షేమానికి పెద్దపీట వేసినప్పటికీ వైసీపీని దారుణంగా ఓడించారని, అలాంటప్పుడు తానెందుకు అదే మార్గంలో వెళ్లాలని చంద్రబాబు భావిస్తుంటారనే ప్రశ్న ఆలోచింపజేస్తోంది. 2014 ఎన్నికల ప్రచారంలో కూడా నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక, చివరి ఆరు నెలల్లో మాత్రం అది కూడా మొక్కుబడిగా కొందరికే భృతి కల్పించారు. అయినప్పటికీ 2024లో బాబు నిరుద్యోగ భృతి ఇస్తామంటే నమ్మిన వారి తప్పా? హామీ ఇచ్చిన వారిది తప్పా? అనేది ఆలోచించుకోవాలి.ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని పీ4కు అనుసంధానం చేశానని ఇప్పటికే చంద్రబాబు చెప్పారు. మళ్లీ ఇప్పుడు అది ఎలా చేయాలో కసరత్తు చేస్తున్నట్టు చంద్రబాబు అన్నారు. ఇవేవీ అయ్యే పనులు కావని ఆయన చెప్పకనే చెప్పారు. అయితే చేయనని నేరుగా చెప్పడం లేదు కదా అని సరిపెట్టుకునే జనం వున్నప్పుడు, ఎవరైనా చేయగలిగేదేమీ వుండదు.సగానికి సగం హామీల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం దాటవేత ధోరణి ప్రదర్శిస్తోంది. ప్రభుత్వ ధైర్యం కేవలం.. అన్నీ ఇచ్చిన వైసీపీ ఘోర పరాజయం పాలైంది కదా అనేదొక్కటే. మనం చేసినా, రేపు ఎన్నికల్లో అదే ఫలితం పునరావృతం కాదనే నమ్మకం ఏంటని బహుశా కూటమి పాలకులు ఆలోచిస్తున్నట్టున్నారు. అందుకే హామీల అమలు విషయంలో ప్రజలు ఏమనుకుంటారో అనే భయం లేకుండా పోతోంది.వైసీపీ దారుణ ఓటమి చంద్రబాబులో సంక్షేమ పథకాల అమలు విషయంలో జ్ఞానోదయం కలిగించిందని చెప్పొచ్చు. సంక్షేమ పథకాలకు ఇప్పటికే పెద్ద మొత్తంలో ఖర్చు చేసినట్టు గణాంకాలతో సహా ఆయన వివరించారు. ఇంతకంటే చేయడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ఇది నిజం కూడా. అయితే ఎన్నికల్లో రాజకీయ పబ్బం గడుపుకోడానికి అలవికాని హామీలిచ్చారని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఎన్నికల్లో సవాలక్ష చెబుతామని, అవన్నీ చేస్తామా? అనే ప్రశ్నను రాజకీయ కోణంలో చూడాల్సి వుంటుంది.అయితే చంద్రబాబు ప్రభుత్వం కొన్ని విషయాల్లో మోసగించడంపై ప్రజల రియాక్షన్ ఎలా వుంటుందో తెలుసుకోవాలంటే ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. ఇప్పటి వరకైతే, చంద్రబాబు రెండు హామీలు తప్ప, అన్నీ నెరవేర్చామని తేల్చి చెప్పారు. ఒకవేళ వైసీపీ నిలదీస్తే, మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు హామీలను ఏం చేశారని ఆయన సైతం ప్రశ్నిస్తున్నారు.బాబు ప్రశ్నలకు ప్రజలు ఇప్పటికే సమాధానం చెప్పారు. వైసీపీ నుంచి సమాధానాన్ని ఆశించడం వ్యర్థం. తినబోతు రుచి చూడడం ఎందుకు? మూడేళ్లు ఆగితే, పరిపాలనపై తీర్పును ఎటూ ప్రజలు ఇస్తారు. అప్పుడు పాలకులు తప్పించుకునే ధోరణికి పట్టడం కడ్తారా? లేక హామీల్ని విస్మరించినందుకు శిక్ష వేస్తారా? అనేది తేలుతుంది.

# 'సహజీవన' హింస నేరమే!



న్యూఢిల్లీ,సహజీవన బంధాల్లో క్రూరత్వాన్ని ఎదుర్కొనే మహిళలకు ఊరటనిచ్చేలా గృహహింస చట్టం పరిధిని విస్తరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వెలువరించిన తీర్పు మహిళలకు ఊరటనిస్తుంది. యుక్త వయసు వచ్చిన జంట పరస్పర అంగీకారంతో వివాహ వ్యవస్థ వెలుపల కూడా సహజీవనం సాగించవచ్చంటూ గతంలో న్యాయస్థానాలు పలు సందర్భాల్లో తెలిపాయి. అయినా ఇలాంటి బంధాలు తరచు వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా కొన్ని రాష్ట్రాల హైకోర్టులు వేర్వేరు కేసుల్లో ఈ బంధాల్లోని నైతికతను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. వివాహ బంధాల్లో ఉండే రక్షణలు సహజీవన బంధాల్లో ఉండబోవని హితోక్తులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 'వివాహ స్వభావం కలిగిన' సహజీవన బంధంలో ఉండే భాగస్వామి నుంచి మహిళ హింసను ఎదుర్కొంటే ఐపీసీ సెక్షన్ 498ఏ(బీఎన్ఎస్ సెక్షన్లు 85, 86) కింద కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. పరస్పర అవగాహన ద్వారా ఒక జంట సహజీవనం చేస్తున్నప్పుడు ఆమెను హింసించే పరిస్థితులు తలెత్తినప్పుడు చట్టం ఆమెకు రక్షణగా నిలబడాలి. ఇప్పుడు తాజా తీర్పువల్ల అలాంటి మహిళలకు భద్రత ఉంటుంది. నాలుగు దశాబ్దాల క్రితం చట్టం ఇంత స్పష్టంగా లేదు. అసలు మన చట్టాల్లో సహజీవన సంబంధాలకు ఎప్పుడూ చోటులేదు. కానీ 2005లో వచ్చిన గృహహింస నిరోధక చట్టం తొలిసారి 'వివాహ స్వభావం' కలిగిన సంబంధంలో ఉన్న మహిళ సమస్యలు ఎదుర్కొంటున్న పక్షంలో ఆమెను బాధిత పక్షంగా గుర్తించింది. ఆడ, మగ ఒకే ఇంట్లో కలిసివుంటూ జీవితభాగస్వాములన్న అభిప్రాయం సమాజంలో కలిగిస్తే, వారు పెళ్లీడుకొచ్చివుంటే, తగినంతకాలం శారీరక సంబంధంలో కొనసాగుతూవుంటే ఆ బంధాన్ని 'వివాహ స్వభావం'గల బంధంగా గుర్తించవచ్చని సుప్రీంకోర్టు 2011లోనే ఒక కేసులో చెప్పింది. వారాంతాల్లో కలిసివున్నప్పుడు ఇది వర్తించబోదని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పు పెళ్లికానంత మాత్రాన ఒక బంధంలో కొనసాగే పురుషుడు మహిళను హింసిస్తుంటే 498ఏ వర్తించబోదనటం సరికాదని వివరించింది. చట్టంలోని 'భర్త' అనే పదాన్ని మరీ సంకుచితంగా తీసుకుని యాంత్రికంగా వర్తింపజేసి బాధిత మహిళకు న్యాయం చేయకపోవటం సరికాదని ధర్మాసనం చెప్పడం గమనించదగింది. లాంఛనంగా పెళ్లి ధ్రువీకరణ పత్రం లేనంతమాత్రాన ఆ బంధంలోని వివాహ స్వభావాన్ని గుర్తించకపోవటం, అక్కడ జరిగే హింసను విస్మరించటం సమాజ పురోగతికి తోడ్పడబోదని కూడా తెలిపింది. ఇద్దరు వ్యక్తులు సహజీవన బంధంలోకి వెళ్లి, వారి మధ్య తలెత్తే విభేదాలు మహిళను హింసించటానికి దారితీస్తే దాన్ని నేరంగా పరిగణించకపోవటం ఎలా చూసినా సరికాదు. సహజీవనంలోవుండే మహిళకు గృహహింస చట్టంకింద ఉన్న రక్షణలు సరిపోతాయనీ, అందువల్ల 498ఏ పరిధిని విస్తరించటం అనవసరమనీ ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదించినా ధర్మాసనం దీన్ని దృష్టిలో ఉంచుకునే తోసిపుచ్చింది. గృహహింస చట్టం కేవలం మనోవర్తి, పరిహారం, ఇంట్లో కొనసాగే హక్కువంటి సివిల్ ఉపశమనాలు మాత్రమే ఇస్తున్నదని... ఆ నేరానికి తగిన శిక్ష ఉండొద్దా అని న్యాయమూర్తులు ప్రశ్నించటం గమనార్హం. ప్రస్తుత కేసులో మహిళ తాను వివాహానికి సిద్ధపడే ఈ సహజీవన బంధంలోకి ప్రవేశించాననీ, కానీ అప్పటికే అతగాడికి పెళ్లయిన విషయాన్ని దాచాడనీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ కేసులోని నిజానిజాల్లోకి పోకుండానే మహిళా క్రూరత్వాన్ని చవిచూస్తుంటే 498ఏ వర్తించితీరాలని తెలిపింది.చట్టాలు చేసే సందర్భాల్లో పార్లమెంటు అవగాహనకు రాని విషయాలు, అప్పటికి అలాంటి పరిస్థితులు లేని సందర్భాలు అనంతర కాలంలో తలెత్తవచ్చు. అంతమాత్రాన సమాజంలో వచ్చిన మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకుండా యాంత్రికంగా అన్వయించటంతో సరిపెడితే బాధితులకు ఎప్పటికీ న్యాయం దక్కదు. అయితే సహజీవనానికి సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేకపోవటం వల్ల ఇలాంటి బంధాల్లో ఏర్పడే సమస్యల విషయంలో వచ్చే కేసుల్ని న్యాయస్థానాలు పదే పదే విచారించి తేల్చవలసి వస్తున్నది. కనుక వర్తమాన సామాజిక స్థితిగతుల్ని దృష్టిలో ఉంచుకుని ఆ మాదిరి చట్టం అవసరాన్ని ప్రభుత్వం గుర్తించటం అవసరం.

# స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

హైదరాబాద్, హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది.పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది. హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది.ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్-5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్-3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు.

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...

విజయవాడ, రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం.ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

## బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష


గుంటూరు,తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు కావడం, 9 నెలలు జైలులో ఉండటం తెలిసిందే.

# ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర...



భువనేశ్వర్, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది.నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి.ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

# నీట్ యూజీ పరీక్షలో మార్పులు




హైదరాబాద్, జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్–యూజీ ( విధానంలో కీలక మార్పులకు సన్నాహాలు జరుగుతున్నాయి. సుమారు లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే ఈ పరీక్షను, ప్రస్తుతం ఉన్న పెన్–అండ్–పేపర్ విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షగా మార్చే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అదేవిధంగా, జేఈఈ (ఏఇఇ) లాగానే, నీట్–యూజీని కూడా మెయిన్, అడ్వాన్స్‌డ్ అనే రెండు దశల్లో నిర్వహించాలని పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది నీట్ పరీక్ష పేపర్ లీక్ అనంతరం దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔం) నిర్వహించే ఎనిమిది ప్రధాన పరీక్షల్లో ఏడు ఇప్పటికే ఆన్‌లైన్‌లో జరుగుతున్నా యని ప్రభుత్వం పేర్కొంది. నీట్–యూజీని సీబీటీ విధానానికి మార్చే అవకాశంపై కూడా చర్చిస్తున్నారు.జేఈఈ తరహాలో రెండు అంచెల పరీక్షా విధానాన్ని అమలు చేయడం వల్ల పరీక్ష భద్రత పటిష్టమవడమే కాకుండా, విద్యార్థుల సామర్థ్యాలను మరింత మెరుగ్గా అంచనా వేయడానికి కూడా వీలవుతుందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నీట్ పరీక్షలో చర్చిస్తున్న మార్పులను ఖరారు చేసే ముందు ఈ టాస్క్ ఫోర్స్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటారు. టాస్క్ ఫోర్స్ నివేదిక అందిన తర్వాతే కొత్త పరీక్షా విధానంపై నిర్ణయం తీసుకుంటారు.

ఈ నిర్ణయం ఒకేసారి అమలు చేయబోం? కేంద్రం

ఆగస్టు 6, శుక్రవారం నాటి విచారణకు ముందు దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌లో, పరీక్షా విధానంలో ఎలాంటి పెద్ద మార్పులు హఠాత్తుగా అమలు చేయబోమని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. విద్యార్థులకు కొత్త విధానం గురించి చాలా ముందుగానే తెలియజేస్తారు, తద్వారా వారు కొత్త విధానానికి సిద్ధం కావడానికి తగినంత సమయం ఉంటుంది.ఈ అఫిడవిట్‌లో పరీక్షకు సంబంధించిన భద్రతా చర్యల వివరాలు కూడా ఉన్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీలు. ఇతర అవకతవకలను నివారించడానికి కొత్త చట్టంతోపాటు అనేక సాంకేతిక, పరిపాలనా చర్యలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. వీటిలో ప్రశ్నపత్రాల బయోమెట్రిక్ ధృవీకరణ, జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసే వన్–టైమ్ లాక్ ట్రంకులు, ఎన్‌క్రిప్టెడ్ డిజిటల్ ప్రశ్నల బ్యాంకులు ఉన్నాయి.నీట్–యూజీ కొత్త పరీక్షా విధానాన్ని ఖరారు చేసే ముందు, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, జాతీయ వైద్య కమిషన్‌తో సహా సంబంధిత వర్గాలన్నింటితో విస్తృత సంప్రదింపులు జరుపుతామని ప్రభుత్వం కూడా తెలిపింది.

# తెలంగాణలో ఎమర్జన్సీకి డయల్ 112 సేవలు షురు!




హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అత్యవసర సేవల కోసం వేర్వేరు నంబర్లు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఇకపై లేదు. ఇప్పటివరకు పోలీసు సేవలకు వినియోగిస్తున్న 'డయల్ 100' స్థానంలో కొత్తగా '112' నంబర్‌ను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నట్లు పోలీసు శాఖ ప్రకటించింది. రాష్ట్రంలోని పౌరులకు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన, స్మార్ట్ , సమన్వయంతో కూడిన సహాయాన్ని అందించడానికి తెలంగాణ పోలీసు శాఖ 'నెక్స్ట్–జనరేషన్ TG-ERSS డయల్ 112' వేదికను అందుబాటులోకి తెచ్చింది.తెలంగాణ పోలీసుల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి డయల్ 112 సేవలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించి పోస్టర్‌ను ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక (ఫైర్) శాఖల అత్యవసర సేవలు ఇకపై ఈ ఒక్క నంబర్ ద్వారానే లభిస్తాయని డీజీపీ ప్రకటించారు. ప్రతి ఒక్కరు 112 నెంబర్ సేవ్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అండగా ఉండేందుకే ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.డయల్ 112 ద్వారా 18 సేవలు అంబాటులోకి వస్తాయన్నారు.

# కాంగ్రెస్,బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ




హైదరాబాద్, నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్ రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

# ప్రగతి నివేదిక కాదది.. గతి తప్పిన నివేదిక : వైఎస్ షర్మిల



అమరావతి : అబద్ధాన్ని అందంగా చెప్పడంలో సీఎం చంద్రబాబు ఘనపాటి అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. రెండేళ్ల పాలనపై కూటమి ప్రోగ్రెస్ రిపోర్టు ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్ అని ట్విటర్‌లో అభివర్ణించారు. ప్రగతి నివేదిక కాదది.. పూర్తిగా గతి తప్పిన నివేదిక అని ఆరోపించారు. నాలుగు సూత్రాల పాలన అపహాస్యం, అభివృద్ధి బూటకం, సంపద సృష్టి మోసం, సమతుల్యత పచ్చి అబద్ధం, సంక్షేమం టోకరా అని పేర్కొన్నారు.విధ్వంసం నుంచి అగాధంవైపు, అధిక అప్పుల నుంచి ఇంకాస్త అంధకారం వైపు కూటమి పాలన కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పక్కన బెట్టి, చెల్లని రూపాయితో చిల్లు రాజకీయం తప్పా రెండేళ్లుగా చంద్రబాబు ఉద్ధరించింది శూన్యమని ఆరోపించారు. భరోసా పేరుతో సగానికి సగం పెన్షన్లలో కోతలు పెట్టారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని మాట

# మంత్రి పదవి రేస్ లో ఉన్నాననే నాపై దుష్ప్రచారాలు : ప్రేమ్ సాగర్ రావు



హైదరాబాద్,అవినీతి, అక్రమాలతో బ్యాంకు రుణాల చెల్లింపు చేసినట్లుగా తనపై వచ్చిన ఆరోపణలను మంచిర్యాల ఎమ్మెల్యే కే. ప్రేమ్ సాగర్ రావు ఖండించారు. మంత్రి పదవి రేసులో ఉన్నాననే నాపై రాజకీయ కుట్రతో ప్రత్యర్థి పార్టీలతో పాటు జిల్లాకు చెందిన సొంత పార్టీ వారు సైతం అవినీతి ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు అని, నాపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టబోనని, వారిపై పరువు నష్టం దావా వేస్తానని, త్వరలో అన్ని కుట్రలు బయటకు వస్తాయని ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు.

నాపై ఆరోపణలు చేస్తున్న వారు చర్చలకు రావాలి

నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్నవారు తనతో ముఖాముఖీ చర్చలకు రావాలని ప్రేమ్ సాగర్ రావు సవాల్ విసిరారు. నేను నా వ్యాపార, వాణిజ్య కంపెనీల పేరిట బ్యాంకుల నుంచి రూ.450 కోట్లు రుణాలు తీసుకుని ఎగవేసి..వాడుకున్నట్లు చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. 2009–10లో బ్యాంక్ రూ.450 కోట్లు రుణాలు మంజూరీ కాగా, సాయినాథ్ ప్రయివేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేరుమీద బ్యాంక్ లోను తీసుకున్నాం అన్నారు. యూఎస్ ట్రేడింగ్ డౌన్ అయిన తర్వాత నేను రూ. 160 కోట్లు లాస్ అయ్యానని,నిజానిర్ధారణ కమిటీ వేస్తే కమిటీ ముందు పూర్తి ఆధారాలు చూపిస్తానని స్పష్టం చేశారు.రూ.450 కోట్లు ఫ్రాడ్ చేస్తే బ్యాంకులు రూ.109 కోట్లకు ఎలా ఆక్షన్ వేస్తుందని, సాంక్షన్ ఆర్డర్స్ నేను క్రియేట్ చేసినవి కాదుఅని, 2014 నుండి 2025 వరకు కంపెనీకి ఫండ్స్ వాడింది రూ.109 కోట్ల 11 లక్షలు అని, అన్ని బ్యాంకులు ఎన్ పీఏ ఇచ్చింది రూ.109 కోట్ల 11లక్షలు అని ప్రేమ్ సాగర్ రావు వెల్లడించారు. ఆర్బీఐ, సెబీ రిజిస్టర్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని, 2014 నుండి 2025 వరకు రూ.44కోట్ల 81లక్షల పేమెంట్ చేశాం అని, రూ.168 కోట్లు 2014–15లో రీజర్వ్ ప్రైస్ ఉందని తెలిపారు. ఆంధ్ర బ్యాంక్ ఎన్ పీఏ అయిన తర్వాత రూ.18కోట్ల 72లక్షలు చెల్లించాం అన్నారుజ 2024 అక్టోబర్ 31 నుండి లోన్ పేమెంట్ చేశాం అని వెల్లడించారు.

పార్టీ కోసం ఎంతో సేవ చేశాను..

నేను పది ఏండ్లు ప్రతి పక్షంలో ఉండి కాంగ్రెస్ కోసం పోరాటం చేశానని, అంతకుముందు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా నేను అధికార దుర్వినియోగం చేయలేదు అని ప్రేమసాగర్ రావు చెప్పుకొచ్చారు. నేను సాండ్,లాండ్, ముడుపులు తీసుకోవాలనుకుంటే అప్పుడే తీసుకునే వాడినన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సొంత నిధులతో నేను 15 స్కూల్స్ కట్టించానని తెలిపారు. నేను దేనిపైనా, ఎవరిపైనా బేస్ లెస్ ఫిర్యాదు చేయనని, అలాగే నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపైన, పత్రిక సంస్థలపైన లీగల్ యాక్షన్ తీసుకుంటానని ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...



నెల్లూరు, ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్–జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్–జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.

# కేటీఆర్, అర్వింద్ .. ఇద్దరి నోటా ఒకే మాట! రేవంత్ టార్గెటెడ్‌గా కామెంట్స్..




హైదరాబాద్,శత్రువుకు శత్రువు మిత్రుడంటారు. ఇప్పుడు ఈ ఇద్దరు మిత్రులయ్యారు. ఒకరు కేటీఆర్, మరొకరు నిజామాబాద్ బీజేపీ ఎంపి ధర్మపురి అర్వింద్. మరి శత్రువెవరు? రేవంత్ రెడ్డే కదా? కాదు ఇక్కడే తప్పులో కాలేశారు. కవిత. ఇదేం ట్విస్టు. అవును.. అర్వింద్‌కు బద్ధ శత్రువు కవిత. కవితను ఓడించి ఎంపీగా గెలిచాడు. తన తండ్రి బీఆరెస్‌లోకి వెళ్లడానికి కవితే కారణం అని బలంగా నమ్ముతాడు అర్వింద్.తన గెలుపు కోసం తండ్రి రాజకీయాన్ని ఆగం చేశారనే కోపం ఉంది అర్వింద్‌కు. అందుకే కవిత ప్రస్తావన రాగానే విరుచుకుపడతాడు. కేసీఆర్‌నూ తుక్కు తుక్కు తిడతాడు. కానీ ఈ మధ్య రేవంత్‌నే టార్గెట్ చేస్తున్నాడు. అచ్చం కేటీఆర్‌లాగే. తాజాగా కేటీఆర్ చేసిన కామెంట్లే చేస్తున్నాడు సీఎంపై.రేవంత్‌రెడ్డి.. ఇంజినీరింగ్ విద్యనుద్దేశించి.. కనీసం వారికి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి కూడా రాదు.. అని కామెంట్ చేయడం.. క్రిమినల్ వేస్ట్ అనే పదం వాడటం వివాదానికి తెర తీసింది. దీనిపై బీఆరెస్ గగ్గోలు పెడుతోంది. విమర్శలు చేస్తోంది. కేటీఆర్ మొన్న ప్రెస్‌మీట్‌లో స్పందిస్తూ.. అసలు నీకు నీ ఎన్నికల అఫిడవిట్‌ను నింపడానికి వస్తుందా? నువ్వేం చదువుకున్నావు? గోడకు సున్నాలేసుకుని బతికావు.. అంటూ పర్సనల్ అటాక్ చేశాడు.సేమ్ ఇదే టైప్ కామెంట్లు చేశాడు అర్వింద్ కూడా. నీ ఎన్నికల అప్లికేషన్ ఫామ్ నీకు నింపుకోవడానికి వస్తదా? చదువు లేని సీఎం.. విద్యాశాఖకు మంత్రా? ఆ మంత్రిత్వ శాఖను చదువుకున్న శ్రీధర్ బాబుకు ఇవ్వు.. అని అంటూ హేళనగా మాట్లాడాడు. ఈ మధ్య కేటీఆర్‌ను ఏం విమర్శించడం లేదు. అడపా దడపా కేసీఆర్‌ను పొగుడుతున్నాడు. బీజేపీని బొంద పెట్టిండంటే కేసీయారే... ఈ రేవంత్‌తోని ఏమీ కాదు.. అంటూ .. బీఆరెస్‌ను లేపే ప్రయత్నం చేస్తున్నాడు.ఫామ్‌హౌజ్‌లో ఉన్న కేసీఆర్‌కు బూస్టింగ్ ఇస్తున్నాడు. తద్వారా కేటీఆర్‌ను ఇండైరెక్టుగా ఎత్తుకుంటున్నాడు. కవిత ఎప్పుడైతే బయటకు వచ్చారో.. కొత్త పార్టీ పెట్టారో.. ఆమె కేటీఆర్‌ను, బీఆరెస్‌ను టార్గెట్ చేస్తున్నారు. పదేళ్ల పాలన పాపాలను ఎత్తి చూపుతున్నారు. కేసీఆర్ పాలన తీరులోని వైఫల్యాల వల్ల ప్రజలు ఎలా ఇబ్బందులు పడ్డారో చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ షాడో సీఎంగా కొనసాగిన వైనాన్నీ, అప్పుడు పట్టింపులేనితనాన్ని, నిర్లక్ష్యాలపై విరుచుకుపడుతున్నారు.ఇదంతా చూసిన తరువాత బహుశా కేటీఆర్‌కు రక్షణగా ఉండాలని అర్వింద్ ఏమైనా భావించి ఉంటాడా? అనే అనుమానాలు వచ్చేలా ఆయన కామెంట్స్ ఉంటున్నాయి. కవిత తనకు శత్రువు.. ఇప్పుడు కేటీఆర్‌కూ శత్రువే.. శత్రువుకు శత్రువు మిత్రుడే అనే సమీకరణతో లోపాయికారిగా ముందుకు పోతున్నాడా? అనే చర్చ కూడా రాజకీయ సర్కిళ్లలో మొదలైంది.బీజేపీ, బీఆరెస్ కలవబోతున్నాయనే ప్రచారం ఉన్న నేపథ్యంలో .. ఇప్పుడు బీఆరెస్‌ను కాదని, ఎక్కువగా సీఎం రేవంత్‌రెడ్డినే టార్గెట్ చేశాడు అర్వింద్. ఎంతలా అంటే.. మిగిలిన బీజేపీ సీనియర్ నేతలెవరూ కూడా సీఎం రేవంత్‌రెడ్డి ని ఇంతలా టార్గెట్ చేయడం లేదు. తన సొంత ఎజెండా అమలు చేయడం అర్వింద్‌కు ఆది నుంచి అలవాటే కానీ, ఈ మధ్య బీఆరెస్‌ను కాపాడుతున్నట్టు.. దానికి మైలేజీ చేకూరేలా తన పొలిటికల్ స్టాండ్ మార్చుకున్నట్టుగా అనిపిస్తున్నది.కవిత పార్టీ విషయంలో కూడా అతడు స్పందిస్తూ... అదొక పార్టీనా? అని హేళనగా మాట్లాడటం ద్వారా కవిత తనకు ఎప్పటికీ శత్రువే.. అనే సందేశమిస్తున్నాడు మీడియా ముఖంగా. అంటే ఆమెను రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలనే భావన అర్వింద్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు దోస్తులయ్యారు. కవిత వల్ల. కవిత కోసం...!

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140